
www.kalamjyothi.com

# కలంజ్యోతి

రేపటి కోసం  మంగళవారం  11.02.2025



### త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డికి

## ఘన స్వాగతం

కలంజ్యోతి, నిర్మల్ : త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డికి బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి సోమవారం ఘనస్వాగతం పలికారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని విజయ హైస్కూల్ వార్షికోత్సవాల్లో భాగంగా ఆయన ముఖ్య అతిథిగా వచ్చారు. ఆయనకు జిల్లా కేంద్రంలోని గెస్ట్ హౌస్ లో ఏలేటి రెడ్డి స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. అనంతరం విజయ హైస్కూల్ లో నిర్వహించిన వార్షికోత్సవాల్లో గవర్నర్ పాల్గొన్నారు. అనంతరం మహేశ్వర్ రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విందులో పాల్గొన్నారు.



### తులం బంగారం

## రూ.లక్ష?

- ఆల్ టైమ్ రికార్డు నమోదు చేసిన పసిడి
- మళ్లీ పెరిగిన పుత్తడి ధరలు
- రూ.88 వేల మార్కును తాకిన గోల్డ్
- రూ.లక్షకు చేరే అవకాశం ఉందంటున్న నిపుణులు

కలంజ్యోతి, హైదరాబాద్ : 10 గ్రాముల బంగారం లక్ష రూపాయిలు. ఈ మాట వింటేనే గుండె కలుక్కుమంటుంది. వెంటనే ఇంట్లో మహిళల నుంచి ఒత్తిడి పెరుగుతుంది. నేను అక్కడికీ కొనమని చెబుతూనే ఉన్నాను.. మీరే పట్టించుకోలేదు.. చూడండి.. ఇప్పుడు పది గ్రాముల బంగారం లక్ష రూపాయలు అవుతుందంట.. అన్న డైలాగులు భర్తలకు ఎదురవుతున్నాయి.. అయితే.. ఇప్పుడు దాని రేటు ఇంకా లక్ష రూపాయిలు అవ్వలేదు. కానీ త్వరలో ఆ ముచ్చటా ఉంటుంది అంటున్నారు నిపుణులు. ఆల్రెడీ 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర 88 వేల మార్కును టచ్ చేసింది. పెళ్లిళ్ల సీజన్ కూడా ప్రారంభంకానున్నడంతో పసిడి పరుగుకు కళ్లెం వేయడానికి అవకాశమే లేకుండా పోయింది.



### అంజన్నకు కిరీటం

## బహూకరణ

కలంజ్యోతి, మల్యాల : ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీఆంజనేయస్వామి వారికి ఏఎంఆర్ ఇండియా లిమిటెడ్ చైర్మన్ ఏ.మహేశ్వర్ రెడ్డి (హైదరాబాద్) భారీస్థాయిలో విరాళం అందజేశారు. సోమవారం కుటుంబ సమేతంగా స్వామివారి దర్శించుకున్న ఆయన రాగి రేకుపై 325 గ్రాముల బంగారంతో చేయించిన కిరీటం, స్వామివారి గర్భాలయం కుడి, ఎడమ వైపు ద్వారబంధనానికి 48.5 కేజీల వెండి తొడుగులను కానుకగా బహుకరించారు. వీటి విలువ దాదాపు రూ.కోటి ఉంటుందని తెలిపారు. అయితే ముందుగా ఆభరణాలకు ఆలయ అర్చకులు సంప్రోక్షణ నిర్వహించారు. అనంతరం స్వామివారి మూలవిరాట్ కు కిరీటాన్ని తొడిగి, వెండి తొడుగులను అమర్చారు.

### రేషన్ బియ్యం రవాణాలో

## కదులుతున్న డొంక

3లో



పలు రైస్ మిల్లులపై కొనసాగుతున్న **దాడులు**

### సమన్వయంతో మహాశివరాత్రి

## విజయవంతం చేయాలి

4లో

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- ఆధ్యాత్మిక శోభతో ఘనంగా నిర్వహించాలి
- 25 నుంచి ఫిబ్రవరి 27 వరకు జాతర నిర్వహణ
- మహా శివరాత్రి ఏర్పాట్లపై సమీక్షా

కలంజ్యోతి
మంగళవారం 11.02.2025



# గురజాల వద్దు.. చెన్నారావుపేట ముద్దు

**కలంజ్యోతి, చెన్నారావుపేట :** 'గురిజల వద్దు.. చెన్నారావుపేట ముద్దు' అని పాత ముగ్దుపుం గ్రామస్తులు నర్సంపేట ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గత ప్రభుత్వము తమ గ్రామాన్ని నర్సంపేట మున్సిపాలిలో కలిపిందన్నారు. తిరిగి గ్రామాన్ని చెన్నారావుపేట మండలంలో కలపాలని అప్పటి ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశామన్నారు. స్పందించిన పెద్ది చెన్నారావుపేట మండలంలో కలిసే విధంగా జీవో ఇప్పించినట్లు గుర్తు చేశారు. ఇప్పుడు రానున్న స్థానిక ఎన్నికల్లో తమ గ్రామాన్ని గురజాల గ్రామంలో ఎంపీటీసీకి కలిపినట్లు వివరించారు. 'గురజాల వద్దు.. మాకు చెన్నారావుపేట ముద్దు' అని పాత మగ్దుపురం గ్రామస్తులు కోరారు. చెన్నారావుపేట గ్రామంలో రెండు ఎంపీటీసీ స్థానాలను ఏర్పాటు చేసి తమ గ్రామాన్ని చెన్నారావుపేటలోనే కొనసాగించాలని నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రామ మాజీ ఉపసర్పంచ్ మేకల సదయ్య, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు సయ్యద్ బషీర్, ఉప అధ్యక్షుడు పోలేపల్లి రమేష్, మాజీ అధ్యక్షుడు నాంపల్లి మల్లయ్య, పఠాన్ వలి పఠాన్ నాగులు, సుంకరి సాంబయ్య, సుంకరి శ్రీధర్, షైక్ యాకుబ్, గ్రామస్తులు పాల్గొన్నారు.



# రైతు వ్యతిరేక సర్కారుపై రైతులు తిరుగుబాటు

**కలంజ్యోతి, చెన్నారావుపేట :** చెన్నారావుపేట మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నాయకులు, రైతులు తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ ఈ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి 14 నెలల కాలం గడుస్తున్నా ఏ ఒక్క హామీని పూర్తిగా అమలు చేయలేదన్నారు. హామీలు అసంపూర్తిగా ఇస్తూ అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తుందని దుయ్యబట్టారు. నేటి వరకు రైతు ఋణమాఫీ పూర్తి కాలేదన్నారు. రైతు భరోసా రూ.15వేలకు దిక్కు లేదని విమర్శించారు. గుంట భూమి లేని రైతులకు ఆత్మీయ భరోసా రూ.12 వేల కోసం ఎదురు చూస్తున్నారన్నారు. ఇల్లులేని వారికి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించాలని, 24 గంటల కరెంటులో కోతలు ఉన్నాయన్నారు. మహిళలకు ఇస్తానన్న రూ.2500 పథకం అటకెక్కిందని ధ్వజమెత్తారు. ఈ విధంగా అనేక రకాల పథకాలను మరిచిపోయి సోమరిపోతుల మారిన రాష్ట్ర ప్రభుత్వాన్ని నిరసన ద్వారా గుర్తు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చినటువంటి అన్ని హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# తులం బంగారం రూ.లక్ష?

**దేశంలో పుత్తడికి అంత డిమాండ్!**

గత 20 ఏళ్లలో పుత్తడి ధర పెరిగిన తీరు చూస్తే.. బాబోయ్ అనాల్సిందే. అంతలా పెరిగిపోయింది. 2004లో 10 గ్రాముల బంగారం ధర దాదాపు 6,300. ఇప్పుడు 88 వేల రూపాయిలు. ఇక ఈ సంవత్సరాంతానికి 10 గ్రాముల పుత్తడి ధర లక్ష రూపాయిలు అవుతుందా? పెరగడం అయితే పక్కా. బంగారాన్ని కొనాలంటే సామాన్య, మధ్యతరగతి వారికి ఇప్పుడు తలకు మించిన భారం. 10 గ్రాముల గోల్డ్ కు 80వేలకు పైగా మదుపు పెట్టి.. దానికి జీఎస్టీ అదనంగా కట్టి.. మజూరీ ఛార్జీలు చెల్లించి.. అబ్బో.. మొత్తం ఖర్చు చూస్తే.. తడిసి మోపెడు అవుతుంది. మరి దీనికి పరిష్కారమేంటి? ఉద్యోగస్తులైతే.. నెల నెలా కాని, ఏడాదికోసారో లేదా పండగల సమయంలో కాని బంగారాన్ని కొంటారు. అలా దేశం మొత్తం మీద ఇప్పటివరకు కుటుంబాలు కొన్న.. వాటి దగ్గర ఉన్న బంగారం ఎంతో తెలుసా? అది.. 25 వేల టన్నులకు పైగా ఉంటుంది. దీనికి విలువ కడితే.. 126 లక్షల కోట్ల రూపాయిలు అవుతుంది. అదీ భారతీయుల గోల్డ్ సత్తా. సాధారణంగా మనవాళ్లు బంగారాన్ని మదుపు మార్గంగానే చూస్తారు. కష్టకాలంలో కుదవ పెట్టి డబ్బులు తెచ్చుకోవడానికైనా ఉంటుందన్న భరోసాతో దీనిని కొనడానికి ఇష్టపడతారు. ఇక పెళ్లి సమయంలో అమ్మాయి తరపువారు.. లాంఛనాలతో పాటు కచ్చితంగా ఎంతోకొంత బంగారం పెడతారు. అదయితే.. తమ ఇంటి ఆడపిల్ల దగ్గరే ఉంటుందని ఆపత్కాలంలో ఆదుకుంటుందని వారి నమ్మకం. అందుకే మన దేశంలో పుత్తడికి అంత డిమాండ్ ఉంటుంది.



**మళ్లీ పెరిగిన బంగారం ధరలు**

మాఘమాసం ప్రారంభం కావడంతో దేశవ్యాప్తంగా వివాహాలు ఊపందుకున్న వేళ పెరిగిన బంగారం ధరలు ప్రజలకు, మహిళలకు షాక్ ఇచ్చాయి. గత రెండు నెలలుగా.. వరుసగా తగ్గుతూ.. పెరుగుతూ వచ్చిన బంగారం ధరలు ఆదివారం కాస్త బ్రేక్ ఇచ్చాయి. కానీ సోమవారం మరోసారి బంగారం ధరలు పెరిగాయి. దాంతో హైదరాబాద్ బులియన్ మార్కెట్లో బంగారం ధర 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ పై రూ.350 పెరుగగా.. 22 క్యారెట్ల తులం బంగారం రూ.79,800 లకు చేరుకుంది. అలాగే 24 క్యారెట్ గోల్డ్ పై రూ. 390 పెరగడంతో.. తులం బంగారం 88,060కు చేరుకుంది. దాంతో చరిత్రలో మొదటిసారి బంగారం రూ.88 వేల మార్కును తాకింది. సోమవారం వెండి ధరలు మాత్రం స్థిరంగా కొనసాగుతున్నాయి. మార్కెట్లో కేజీ సిల్వర్ ధర రూ.1,07,000గా ఉంది. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో పెళ్లిళ్ల సీజన్ మొదలవడంతో నిత్యం పెరుగుతున్న బంగారం ధరలు పేద, మధ్యతరగతి ప్రజలకు శాపంగా మారుతున్నాయి. ప్రతి పెళ్లిలో బంగారం తప్పనిసరి కావడంతో ధర ఎంత పెరిగిన ప్రజలు కొనకమానడం లేదు. ఈ ధరలు ఇలానే పెరిగితే త్వరలోనే తులం బంగారం రూ.లక్ష చేరే అవకాశం ఉన్నట్లు నిపుణులు అంచనా వేస్తున్నారు.

**సంక్షోభంలో ఆదుకునే పెట్టుబడి!**

ఉన్నంతలో ఎంతో కొంత బంగారాన్ని కొనడానికి చాలామంది ఆసక్తి చూపిస్తున్నారు. దీనికి కారణం లేకపోలేదు. మన దేశంలో 6 లక్షల 64 వేలకు పైగా గ్రామాలు ఉన్నాయి. కానీ వీటిలో దాదాపు 40 వేల గ్రామాల్లో మాత్రమే బ్యాంకులకు బ్రాంచీలు ఉన్నాయి. మరి మిగిలిన గ్రామాల సంగతేంటి? అందుకే చేతిలో డబ్బు ఉన్నప్పుడు దానిని బ్యాంకులో దాచుకోవడం కంటే.. బంగారాన్ని కొనడానికే మనవాళ్లు ఎక్కువగా ప్రాధాన్యతను ఇస్తారు. అదయితే.. అవసరం వచ్చినప్పుడు తాకట్టు పెట్టి డబ్బు తెచ్చుకోవడం కూడా సులభమే. 2022లో భారతదేశంలోని 15 శాతం కుటుంబాలు బంగారంలో ఇన్వెస్ట్ చేశాయి. అదే 2023కి వచ్చేసరికీ ఆ సంఖ్య 21 శాతానికి పెరిగింది. దీనివల్లే పుత్తడికి డిమాండ్ పెరుగుతుంది. దానితోపాటే ధరా పెరుగుతున్నది. ఒక్కమాటలో చెప్పాలంటే.. బంగారం కొనడం మనవాళ్ల దృష్టిలో ఖర్చు కాదు.. సంక్షోభంలో ఆదుకునే పెట్టుబడి.

# బీఆర్ఎస్ నాయకులు నిరసన తెలపడం సిగ్గుచేటు

**కాంగ్రెస్ చెన్నారావుపేట మండల అధ్యక్షుడు భూక్య గోపాల్‌నాయక్**



**కలంజ్యోతి, చెన్నారావుపేట :** బీఆర్ఎస్ నాయకులు గ్రామ పంచాయతీల్లో నిరసన తెలపడం సిగ్గుచేటని, పదేళ్లలో అభివృద్ధి ఎంత చేశారో చర్చకు రావాలని కాంగ్రెస్ చెన్నారావుపేట మండల అధ్యక్షుడు భూక్య గోపాల్ నాయక్ సవాల్ విసిరారు. పదేళ్లు అధికారంలో ఉండి ఏ ఒక్క పేద కుటుంబాన్ని ఆదుకున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో ఎవరికీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కట్టించారు చెప్పాలన్నారు. రూ.లక్ష ఋణమాఫీ చేస్తామని ఎన్నికల్లో దొంగ హామీ ఇచ్చారన్నారు. ఏకకాలంలో రైతులకు రూ.2లక్షల ఋణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీది అని గుర్తు చేశారు. మహాలక్ష్మి పథకం. రూ.500కే గ్యాస్ సిలిండర్,ఇ 200 యూనిట్ల విద్యుత్ ఉచితంగా ఇస్తున్నారని నిరసన వ్యక్తం చేస్తున్నారా? అని ప్రశ్నించారు. కనీసం పేదలకు రేషన్ కార్డు జారీ చేసిన పాపన పోలేదన్నారు. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకుని ప్రజాప్రభుత్వానికి సహకరించాలన్నారు.




# అయ్యా బాంచన్ .. నా భూమి కాపాడండి

**కలంజ్యోతి, జగిత్యాల :** అయ్యా బాంచన్ నా భూమిని కబ్జా చేసేందుకు చూస్తున్నారు.. ఎలాగైనా మీరే కాపడుండ్రి అంటూ జగిత్యాలకు చెందిన వృద్ధురాలు ప్రజావాణిలో కలెక్టర్ సత్యప్రసాద్ కు ఫిర్యాదు చేసింది. పట్టణంలోని మంచినీళ్ల బావి ఏరియాకు చెందిన కడార్ల రాజమ్మ సర్వేనెంబర్ 1751 లో ఉన్న తన 29 గుంటల భూమి కొందరు కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొంది. ఈ ఘటనపై విచారణ జరిపి కబ్జా కోరుల నుంచి తన భూమిని కాపాడాల్సిందిగా అధికారులను వేడుకుంది. స్పందించిన జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ విచారణ జరిపి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

కలంజ్యోతి 3
మంగళవారం 11.02.2025 Local News

# రేషన్ బియ్యం రవాణాలో కదులుతున్న డొంక

## పలు రైస్ మిల్లులపై కొనసాగుతున్న దాడులు

**కలంజ్యోతి, నిర్మల్ :** నిర్మల్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో రేషన్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేస్తున్న ఉదంతంలో పోలీసులకు పలు కొత్త తెలిశాయి. ఈ నెల 8న 36 టన్నుల పీడీఎస్ బియ్యాన్ని తీసుకెళ్తున్న లారీని స్వాధీనం చేసుకున్నారు. కాగా.. ఈ ఘటనలో పట్టుబడిన బియ్యం ధర్మాబాద్‌లోని రవూఫ్ గోడౌన్ నుంచి లక్ష్మణచాందలోని హన్మంత్ రెడ్డి రైస్ మిల్లుకు తీసుకెళుతున్నట్లు దర్యాప్తులో గుర్తించారు. సరిహద్దుల్లోని స్థానిక గ్రామాల నుంచి సేకరించిన పీడీఎస్ బియ్యాన్ని వాహనంలో అక్రమంగా రవూఫ్ గోడౌన్‌కు తీసుకెళ్తుండగా బిదరెల్లి చెక్‌పోస్ట్ వద్ద పట్టుకొన్నారు. అనంతరం లక్ష్మణ చాంద హనుమంతరెడ్డి రైస్ మిల్లుపై జరిగిన దాడిలో కరీంనగర్‌లోని సుల్తానాబాద్‌కు చెందిన రెండు ట్రక్కులు కనిపించాయి. తనిఖీల్లో కరీంనగర్ తదితర ప్రాంతాలకు అక్రమ రవాణా జరిగినట్లు గుర్తించారు. మిల్లు నుంచి రిజిస్టర్లను స్వాధీనం చేసుకున్నారు.



**పీడీఎస్ అక్రమ బియ్యం రాకెట్ వ్యవహారం తీరిది!**

బియ్యం మిల్లుల యజమానులు ప్రభుత్వం నుంచి వడ్లను కొనుగోలు చేసి మిల్లింగ్ కోసం క్వింటాల్‌కు సుమారు రూ.35 తీసుకుంటారు. మిల్లులు సేకరించిన మొత్తం వడ్లకి మిల్లింగ్ ఛార్జీలను క్లెయిమ్ చేస్తారు. కాని దానిలో కొంత భాగాన్ని మాత్రమే మిల్లింగ్ చేస్తారు. మిగిలిన ధాన్యాన్ని అక్రమంగా రవాణా చేసి చట్టవిరుద్ధంగా విక్రయిస్తారు.

**బియ్యం దాదాపు 40వేల కిలోలు!**

ఈ ఘటనల సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా నిర్మల్ జిల్లాలో గ్రామాల నుంచి పీడీఎస్ రైస్ ని తక్కువ రేటుకు కొంటున్నారన్నారు. వీటిని మహారాష్ట్రలో అజ్ఞాత ప్రాంతంలో కొన్ని మిల్లుల్లో ఆ రైస్ ను సన్నగా పాలిష్ చేసి తిరిగి కొన్ని బ్రాండ్ల పేరుతో విక్రయించడానికి జిల్లాకి తీసుకు వస్తున్నారన్నారు. అక్రమాలకు పాల్పడుతున్న వారిపై చట్టపరంగా కఠిన చర్యలుంటామని తెలిపారు. పీడీఎస్ బియ్యం అక్రమంగా మళ్లించడం, వడ్లని సైఫన్ చేయడంలో ఒక వ్యవస్థీకృత నెట్‌వర్క్ నడుస్తుందని దర్యాప్తులో బయటపడిందని వివరించారు. రైస్ మిల్లులు, ఏజెంట్ల ప్రమేయం ఉందని తేలిందన్నారు.



## పారిశుధ్యం విషయంలో నిర్లక్ష్యం వద్దు

### కలెక్టర్ అభిలాష

**కలంజ్యోతి, నిర్మల్ :** పారిశుధ్యం విషయంలో నిర్లక్ష్యం పనికిరాదని, పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో మెరుగైన పారిశుధ్యం, పచ్చదనం పెంపొందేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డులో కలెక్టర్ పర్యటించి, నిర్వహిస్తున్న పారిశుద్ధ్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఫిబ్రవరి 10నుంచి ఈ నెల 15వ తేదీ వరకు జిల్లాలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి వార్డుల్లో మురికి కాలువలను ఎప్పటికప్పుడూ శుభ్రపరచాలన్నారు. పారిశుద్ధ్య కార్మికులు మురికి కాలువలను శుభ్రం చేసిన తర్వాత ఆయా వార్డులోని ప్రజలతో సంబంధిత రిజిస్టర్ లో సంతకాన్ని తీసుకోవాలని చెప్పారు. 9వ వార్డు సమీపంలో గల కుంటను కలెక్టర్ పరిశీలించి, మురికి నీరు నిలువ ఉండకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మస్కాపూర్ కేజీబీవీ పాఠశాలను కలెక్టర్ సందర్శించారు. కేజీబీవీ లోని వంటగది, సరుకుల నిల్వగది, విద్యార్థుల వసతి గృహాలను తనిఖీ చేశారు. తరగతి గదిలో విద్యార్థులను పలు సబ్జెక్టు ల్లో ప్రశ్నలు అడిగి జవాబులు రాబట్టారు. విద్యార్థులు సమాధానాలు చెప్పడంతో విద్యార్థులను కలెక్టర్ అభినందించారు. అనంతరం సత్తెనపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో చేపట్టిన శ్రమదాన కార్యక్రమంలో అధికారులతో కలిసి కలెక్టర్ పాల్గొని పిచ్చి మొక్కల్ని తొలగించి, పరిసరాలను శుభ్రం చేశారు. నేటి నుంచి ఈ నెల 15వ తేదీ వరకు జిల్లాలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులందరూ శ్రమదాన కార్యక్రమాలను చేపట్టి, కార్యాలయాలను, కార్యాలయ పరిసరాలను శుభ్రపరచుకోవాలన్నారు. నర్సరీని పరిశీలించి నర్సరీలో పెంచుతున్న మొక్కల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఈఓ పి.రామారావు, డీపీఓ శ్రీనివాస్, ఖానాపూర్ మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ, తహసీల్దార్ సుజాత, సీపీఓ జీవరత్నం, ఎంపీడీవో సునీత, ఎంపీఓ రత్నాకర్, కేజీబీవీ ప్రధానోపాధ్యాయులు సునీత, విద్యార్థులు, ప్రజలు, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పోటీ పరీక్షలపై అవగాహన సదస్సు



**కలంజ్యోతి, నల్గొండ:** పోటీ పరీక్షల కోసం విద్యార్థులు ఇప్పటి నుంచే ప్రణాళికలు వేసుకోవాలని అసిస్టెంట్ ప్రొఫెసర్ మహమ్మద్ హసేన సూచించారు. నల్గొండ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఉద్యోగ ఉపాధి అవకాశాల గురించి ఉపన్యాసం ఇచ్చారు. గ్రూప్ 1, కానిస్టేబుల్ లాంటి ఉద్యోగాలకు, స్టాఫ్ సెలక్షన్ కమిషన్, రాత పరీక్ష విధానం, విశ్వవిద్యాలయాలు నిర్వహించే పీజీ ప్రవేశ పరీక్షలకు సంబంధించిన విధివిధానాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస రాజు, ఆంగ్ల శాఖ హెడ్ రామిరెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.





## వేములవాడలో సామాన్య భక్తులకు శీఘ్ర దర్శనం!

### క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్న రాజన్న ఆలయ ఈవో కె.వినోద్

**కలంజ్యోతి, వేములవాడ :** వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో సోమవారం భక్తుల రద్దీ నెలకొంది. స్వామి వారికి ఇష్టమైన రోజు కావడంతో అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. ముందుగా ధర్మగుండంలో స్నానాలు ఆచరించిన తర్వాత కోడె మొక్కులతో పాటు ఇతర మొక్కులు చెల్లించుకున్నారు. పరివార దేవతలను సైతం దర్శించుకుని పూజలు నిర్వహించారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తలనీలాలు సమర్పించుకొని సేవలో తరించారు. దీంతో సామాన్య భక్తులకు ధర్మదర్శనంలో లోటుపాట్లు ఇబ్బందులు లేకుండా ఈవో కె.వినోద్ క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నారు. సామాన్య భక్తులకు శీఘ్రంగా దర్శనమయ్యే విధంగా కృషి చేస్తున్న ఈవో తీరుపై భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆలయ అధికారులకు, ఎస్పీఎఫ్ సిబ్బందికి ఈవో పలు సూచనలు చేశారు.



## వాలీబాల్ కిట్ అందజేత

### అందజేసిన మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ వోల్లాల వెంకటేష్ గౌడ్

**కలంజ్యోతి, ఇల్లంతకుంట :** ఇల్లంతకుంట మండలంలోని అనంతారం గ్రామంలో యువకులకు సోమవారం మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ వోల్లాల వెంకటేష్ గౌడ్ వాలీబాల్ కిట్ ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని క్రీడలలో మానసికోల్లసాన్ని ఇస్తాయని క్రీడలతోపాటు చదువులో రాణించాలన్నారు. కార్యక్రమంలో యువకులు తదితరులు పాల్గొన్నారు.




## ధాన్యం కొనుగోలు పారదర్శకంగా కొనసాగించాలి

### జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్

**కలంజ్యోతి, జగిత్యాల :** రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ధాన్యం కొనుగోలు పారదర్శకంగా కొనసాగించాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అన్నారు. సోమవారం కలెక్టరెట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో రాబోయే యాసంగి 202425 వరిధాన్యం కొనుగోలు సంబంధించిన సన్నద్ధతపై అదనపు కలెక్టర్ బి.ఎస్ లతతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సమర్థవంతమైన ప్రణాళిక రూపొందించి, రైతులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకొని ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ధాన్యం కొనుగోలు పారదర్శకంగా కొనసాగేలా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా అకాల వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రతలు తీసుకొనే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించినారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. ఎస్. లత, వివిధ జిల్లా స్థాయి శాఖాధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## అన్నదాత! సుఖీభవ!!

### - మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్..

**కలంజ్యోతి, వేములవాడ :** మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో 1389 రోజులుగా నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమంలో భాగంగా సోమవారం రోజున లక్ష్మీగణపతి, రాజన్న, భీమేశ్వర ఆలయాల వద్ద పేదలకు, అన్నార్తులకు అన్నదాన, పండ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని ట్రస్టు నిర్వాహకులు మధు మహేష్ తెలిపారు. సోమవారం వివాహ వార్షికోత్సవం సందర్భంగా బొందిళ్ళ నరేష్ లక్ష్మి దంపతులు, తోట దేవరాజు బాలలక్ష్మి దంపతులు, మెటుపల్లి వాస్తవ్యులు నంబి రాజేంద్ర శర్మ అరుణ దంపతులు అన్నదానం చేయాలన్న సంకల్పంతో జగిత్యాల వాస్తవ్యులు నల్ల వసంత సతీష్ దంపతులు, శాశ్వత దాతలుగా జువ్వాడి స్నేహలత వెంకటేశ్వరరావు దంపతులు, ప్రతాప స్వప్న సంపత్ దంపతులు, గణాచారి మఠం శైలజ సాంబశివు దంపతులు, దేవరాజు ఉమ బాల చందర్ రాజు దంపతులు, రామడుగు శ్రీలత, కొడుకులు కోడళ్లు: ప్రజ్ఞ శరత్ చంద్ర దంపతులు, శిరీష సాయిచంద్ర దంపతులు, శర్వాణి రవిచంద్ర దంపతులు, హైదరాబాద్ వాస్తవ్యులు చిన్నారులు శ్రీహర్ష, సాయికృష్ణ ఉన్నారని పేదలకు అన్నదాన కార్యక్రమానికి సహకారం అందించాలనుకునే దాతలు ట్రస్టు సభ్యులను గాని ట్రస్టు ఫోన్ నంబర్ 92469 39388 ద్వారా సంప్రదించాలని ట్రస్టు నిర్వాహకులు మధు మహేష్ కోరారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు మధు మహేష్, ప్రతాప నటరాజు తదితరులు పాల్గొన్నారు.



# సమన్వయంతో మహాశివరాత్రి విజయవంతం చేయాలి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- ఆధ్యాత్మిక శోభతో ఘనంగా నిర్వహించాలి
- 25 నుంచి ఫిబ్రవరి 27 వరకు జాతర నిర్వహణ
- భక్తుల నుంచి ఫిర్యాదు రాకుండా ఏర్పాట్లు చేయాలి
- మహా శివరాత్రి ఏర్పాట్లపై ఎస్పీతో కలెక్టర్ సమీక్ష



**కలంజ్యోతి, రాజన్నసిరిసిల్ల :** అన్ని శాఖల అధికారులు సమన్వయంతో మహాశివరాత్రి జాతర ను విజయవంతం చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. మహాశివరాత్రి జాత ర సందర్భంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఎస్పీ అఖిల్ మహాజన్, వేములవాడ రాజరాజేశ్వర ఆలయ ఈవో, ఆయా శాఖల ఉన్నతాధికారులతో కలిసి సోమవారం కలెక్టర్ జాతర సమన్వయ సమావేశం నిర్వహించారు. జాతర సందర్భంగా అదనపు బస్సులు, పారిశుద్ధ్యం, పార్కింగ్, రోడ్డు నిర్వహణ, దేవాలయం వద్ద వసతి సౌకర్యం, త్రాగునీటి సరఫరా, హెల్త్ క్యాంప్ ల ఏర్పాటు, ఫైర్ ఇంజన్ సౌకర్యం, కళ్యా ణ కట్ట, ధర్మ గుండం, బద్ది పోచమ్మ ఆలయం, హెల్ప్ సెంటర్, సీసీ టీవీల ఏర్పాటు సాంస్కృతిక కార్యక్రమాలు తదితర అంశాల పై సంబంధిత శాఖ అధికారులు సిద్ధం చేసుకున్న ప్రణాళికను వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డారు. ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు మహా శివరాత్రి జాతర వేడుకలను వైభవోపేతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కల్గకుండా జాతర నిర్వహించాల్సి ఉంటుందని, నిర్దేశించు కున్న పనులను జాతర సమయానికి సన్నద్ధమ య్యే విధంగా వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు.

**పటిష్ఠ భద్రత..**
జాతర కు వచ్చే భక్తుల సంఖ్య దృష్ట్యా పటిష్ట భద్రత వ్యవస్థ ఏర్పాటు చేయాలని అన్నారు. భక్తు లు అధిక సంఖ్యలో రానున్న నేపథ్యంలో ఫోన్ సిగ్నల్స్ సమస్య దృష్టిలో ఆపరేటర్లతో చర్చించి తాత్కాలిక టవర్ల ఏర్పాటు చేయాలని అన్నారు.

**నిరంతరం పర్యవేక్షణ ఉండాలి..**
వివిధ డిపోల నుంచి మొత్తం 857 బస్సులు నడిపించనున్నట్లు తెలిపారు. 20 లక్షల లీటర్ల నీటిని మిషన్ భగీరథ ద్వారా సరఫరా చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. 500 మంది పారిశుధ్య సిబ్బంది అందుబాటులో ఉంటారని వేములవాడ మున్సిపల్ కమిషనర్ అన్వేష్ పేర్కొన్నారు. 8 అగ్నిమాపక వాహనాలు, ఇప్పటికే 260 సీసీ కెమెరాలు ఉండగా మరో 180 కెమెరాలు అందుబాటులోకి తీసుకురానున్నట్టు తెలిపారు. 24 మంది గజ ఈత గాళ్లు సేవలు అందిస్తారని అధికారులు వివరించారు. 3 లక్షల లడ్డులు, ప్రసాదం సిద్ధంగా పెట్టనున్నట్లు ఆలయ ఈవో వెల్లడించారు. జాతర సందర్భంగా గుడి చెరువు ప్రాంతంలో భక్తులకు అల్పాహారం ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు వివరించారు. పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని, వేములవాడ పట్టణానికి వచ్చే అన్ని ప్రధాన రోడ్లలో ఉన్న గుంతలను వెంటనే పూడ్చి వేయాలని రోడ్డుకు ఇరు వైపులా పిచ్చి మొక్కలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. జాతర విధులు నిర్వహించడానికి వచ్చే సిబ్బందికి, ముఖ్య అతిథులకు వసతి సౌకర్యం కల్పించాలని అన్నారు. భక్తుల కోసం అవసరమైన మేర పందిర్లు ఏర్పాటు చేయాలని, ప్రతి పందిరి దగ్గర అవసరమైన భద్రత కల్పించాలని అన్నారు. జాతర సందర్భంగా వచ్చే భక్తులకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా ఎక్కడికక్కడ చలి వేంద్రాలను, చలువ పందిరిలు ఏర్పాటు చేయాలని అన్నారు. ఆలయ పరిసరాలలో అపరిశుభ్రత కాకుండా మూడు షిఫ్ట్ లో పారిశుధ్య సిబ్బంది విధులు నిర్వహించాలని పేర్కొన్నారు. జాతర సందర్భంగా వైద్య క్యాంపులు ఏర్పాటు చేయాలని, నిరంతర విద్యుత్ సరఫరా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, ముఖ్యమైన ప్రదేశాలలో అన్ని పందిళ్ళ వద్ద మంటలు ఆర్పే ఫైర్ యంత్రాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.

**హెల్ప్ డెస్క్ ఏర్పాటు..**
ప్రధాన ఆలయం, తిప్పాపూర్ బస్టాండ్, కోరుట్ల బస్టాండ్, జగిత్యాల రోడ్డు, పార్కింగ్ దగ్గర అవసరమైన హెల్ప్ డెస్కు ఏర్పాటు చేయాలని అన్నారు. మహా జాతర జరిగే సందర్భంగా మద్యం అమ్మకాలను వేములవాడ పరిసరాలలో నిషేధించాలని అన్నారు. మహాశివరాత్రి జాగారం సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించాలని దానికోసం అవసరమైన ఏర్పాట్లు చేయాలని అన్నారు. జాతరను పర్యవేక్షించేందుకు అన్ని శాఖల అధికారుల నోడల్ ఆఫీసర్ల సమన్వయంతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు.

**గతం కంటే అధికంగా పార్కింగ్ ప్లేస్..**
ఎస్పీ అఖీల్ మహాజన్ మాట్లాడుతూ, గతం కంటే అధికంగా పార్కింగ్ ప్లేస్ ఏర్పాటు చేయాలని, అక్కడ పోలీసుల కోసం టెంట్, తాగునీటి సరఫరా ఉండాలని అన్నారు. తిప్పాపూర్ చౌరస్తా దగ్గర సాయంత్రం ఉండే మార్కెట్ జాతర సమయంలో ఉండకుండా ముందస్తు సమాచారం సంబంధిత వ్యాపారులకు అందజేయాలని ఎస్పీ మున్సిపల్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ శేషాద్రి రెడ్డి, ఈ.ఓ వినోద్ రెడ్డి, రెవెన్యూ డివిజన్ అధికారి రాజేశ్వర్, సంబంధిత జిల్లా అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

